సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



నేడు గంగమ్మ ఒడికి..

పది రోజుల పాటు పూజలందుకున్న గణనాథు లను గంగమ్మ ఒడికి తరలించేందుకు మండ పాల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. 8లో



జీసీసీలో సేల్స్‌మెన్ల కొరత

ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు నిత్యావసర సర కులను పంపిణీ చేస్తున్న జీసీసీ సేల్స్ డిపోల్లో సేల్స్‌మెన్ల కొరత వేధిస్తోంది. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం మొదలైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి తీసు కొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధార ణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భగవంతుడిపై విశ్వాసం ఉండాలి



మాట్లాడుతున్న బ్రహ్మానంద సరస్వతి

అన్నపురెడ్డిపల్లి: ప్రతి ఒక్కరూ భగవంతుడిపై విశ్వాసం పెంపొందించుకోవాలని నైమిశార ణ్య పీఠాధిపతి శ్రీ బాలా బ్రహ్మానంద సరస్వతి స్వామిజీ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించు కుని, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చకులు స్వామిజీకి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బ్రహ్మానంద సరస్వతి భక్తులనుద్దేశించి మాట్లా డారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండా లన్నారు. భగవంతుడిపై సంపూర్ణ విశ్వాసంతో ఏ పని చేసినా, సఫలీకృతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు ప్రసా దాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.51 లక్షలకు గణపతి లడ్డూ కైవసం

ఇల్లెందు : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడి చేతిలో లడ్డూను ఉంచి మండపాల్లో పూజలు నిర్వహించడం ఆన వాయితీగా వస్తోంది. అయితే ఆ లడ్డూను మం డపాల నిర్వాహకులు చివరి రోజున వేలం వేస్తుంటారు. వినాయకుడి ప్రసాదమైన ఈ లడ్డూను వేలం ద్వారా పొందేందుకు పలువురు భక్తులు ఆసక్తి కనబరుస్తారు. ఈ క్రమంలో ఇల్లెందు కాకతీయ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని లడ్డూ ప్రసాదాన్ని హైదరాబాద్‌కు చెందిన బోళ్ల వెంకటరెడ్డి రూ. 3.51 లక్షలకు కైవసం చేసుకున్నారు.

రామాలయంలో నెయ్యి సరఫరా ఏజెన్సీ మార్పు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ప్రసాదం, ఇతర పూజా కార్యక్రమాలకు వినియోగించే నెయ్యి పంపిణీదారులను మార్పు చేశారు. ఆలయం లో నెలకు 70 క్వింటాళ్లకు పైగా నెయ్యి విని యోగిస్తుంటారు. ప్రస్తుతం కరీంనగర్ డెయిరీ వారు కేజీకి రూ.621 చొప్పున నెయ్యి సరఫరా చేస్తున్నారు. అయితే జంగారెడ్డిగూడేనికి చెం దిన ఓ డెయిరీ నిర్వాహకులు రూ.534కు కేజీ చొప్పున అందించేందుకు ముందుకు రావడం తో పంపిణీ ఏజెన్సీని మార్పు చేసినట్లు ఈఓ రమాదేవి తెలిపారు. అలాగే ఆలయంలో పార దర్శకత పెంపొందించేందుకు ఆన్‌లైన్ విధా నాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఆలయానికి పేటెంట్ హక్కులు పొందేలా ప్రణాళిక రూపొందించటానికి యుద్ధప్రాతిపదికన చర్య లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాపాలన వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో మంగళవారం జరిగే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడిం చారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహ కార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేడు కలకు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొ న్నారు. నేడు ఉదయం 10 గంటలకు మంత్రి తుమ్మల జాతీయ జెండా ఆవిష్కరిస్తారని వివ రించారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అటు రైతులు, ఇటు కార్మికులు

ఉద్యమ కేంద్రంగా పాల్వంచ

రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభానికి కొన్నేళ్ల ముందు నుంచి.. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత కొంత కాలం పాటు తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాటం జోరుగా సాగింది. గ్రామీణ ప్రాంతాల్లోని జమీందార్లు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా రైతులు, రైతు కూలీలు కదం తొక్కారు. జిల్లాలోని పాల్వంచ, అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన వద్ద రజాకార్లకు, సాయుధ రైతులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అయితే, అప్పటికే పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న జిల్లాలో కమ్యూనిస్టుల పోరాటం ప్రధానంగా కార్మిక హక్కుల సాధనపై సాగినట్టు నాటి చరిత్రను బట్టి తెలుస్తోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



నిజాం మిలిటరీని ఎదిరించిన కోయ దళం

- గుంపెనలో రజాకార్లు – గెరిల్లా దళాల మధ్య కాల్పులు
- సింగరేణిలో కార్మిక సంఘాల రూపంలో రహస్య పోరాటం
- హక్కుల సాధన ధ్యేయంగా కమ్యూనిస్టుల ఉద్యమం

గడగడలాడించిన కోయ దళం..

సాయుధ రైతాంగ పోరాటంలో భాగంగా వేంసూరులో రైతులకు భూములు పంచిన దళాలకు పాల్వంచ తాలూకాలో అపూర్వ స్వాగతం లభించింది. ఇక్కడ 120 మంది ఆదివాసీ, కోయ యువకులతో గెరిల్లా దళం ఏర్పాటైంది. భూ పంపిణీ మొదలైంది. ప్రజారాజ్యం దిశగా అడుగులు పడుతుండడంతో, దాన్ని అణచివేసేందుకు నిజాం సర్కార్ 1000 మంది సైనికులను పాల్వంచ తాలూకాకు పంపింది. 15 రోజుల పాటు ఇరువర్గాల మధ్య పోరాటం జరిగింది. ఇందులో ఎనిమిది మంది నిజాం మిలిటరీ జవాన్లు మృతి చెందగా.. గెరిల్లా దళ నాయకుడు ముత్యాలు వీరమరణం పొందాడు. మరో ఆరుగురిని నిజాం సర్కార్ ఉరి తీసి చంపి, వారి శవాలు చెట్లకు వేలాడదీసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది.

గుంపెన పోరాటం

అన్నపురెడ్డిపల్లి మండలంలోని గుంపెన గ్రామంలో 1948లో రజాకార్లకు – సాయుధ పోరాట యోధులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. వట్టికుంట నాగేశ్వరరావు నేతృత్వంలో 60 నుంచి 70 మంది సభ్యులతో కూడిన దళం గుంపెనలో ఓ ఇంట్లో సమావేశమయ్యారు. ఈ విషయం బయటకు పొక్కడంతో సమీపంలోని కల్లూరులో మకాం వేసిన రజాకార్లు హుటాహుటిన గుంపెనను చుట్టుముట్టడంతో ఇరువైపులా కాల్పులు జరిగాయి. రజాకార్ల దాడిని తప్పించుకుంటూ దళాలు సమీపంలోని చెరువు మీదుగా అడవుల్లోకి వెళ్లాయి. ఈ కాల్పుల్లో ఒక గెరిల్లా, మరో ఇద్దరు గుంపెన గ్రామస్తులు చనిపోయారు. సాయుధ దళాలు వెనక్కి మళ్లినా రజాకార్లు గుంపెనను వీడలేదు. చివరకు అప్పటి కలెక్టర్, జంగిల్ అమీన్ గుంపెన చేరుకుని విచారణ చేపట్టి, ఆ గ్రామంలో రైతాంగ పోరాట మద్దతు దారులు లేరంటూ రిపోర్టు ఇచ్చారు. దీంతో రజాకార్లు గుంపెనను వదిలి వెళ్లారు.

ఆర్జీల రూపంలో..

రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో బ్రిటీష్ ప్రభుత్వానికి బొగ్గు అవసరం పెరిగింది. దీంతో బొగ్గు గని కూలీల డిమాండ్లను ఆర్జీల రూపంలో వినేందుకు సింగరేణిలో పనిచేసే యూరోపియన్ అధికారులు ఆసక్తి చూపేవారు. అయితే ఆర్జీలు రాసివ్వడం నిరక్షరాస్యులైన కార్మికులకు తలకు మించిన పనిగా ఉండేది. ఈ బాధ్యతలను పర్సా సత్యనారాయణ బృందం సమర్థంగా నిర్వహించేది. ఆర్జీల కారణంగా పని ప్రదేశాల్లో పరిస్థితులు మెరుగయ్యాయి. నిత్యావసర సరుకుల పంపిణీ విధానంలో అవినీతి తగ్గింది. తమ అక్రమార్జనకు గండికొట్టిన ఈ పిటీషన్ల వ్యవహారం నైజాం ఆధీనంలోని కాంట్రాక్టర్లకు కంటగింపుగా ఉండేది.

శ్మశానమే ఆవాసంగా..

యూరోపియన్ అధికారులకు కూలీల తరఫున ఆర్జీలు రాసిచ్చేది ఎవరో చెప్పాలంటూ నిజాం పోలీసులు కార్మికులను ఒత్తిడి చేసేవారు. ఆర్జీలు ఇచ్చే కార్మికులను చావబాదేవారు. అయితే 'కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో భద్రాచలం వెళ్లే భక్తుడు ఎదురైతే అతనితో ఆర్జీ రాయించుకున్నాను' అని మస్కా కొట్టేలా నాటి నాయకులు కార్మికులకు శిక్షణ ఇవ్వడంతో ఈ సమస్యకు విరుగుడు కనిపెట్టారు. దీంతో నిజాం సర్కార్ నిర్బంధాన్ని మరింతగా పెంచింది. కాగా, కార్మికుల ఇళ్లలోనే రోజుల తరబడి చీకట్లో నక్కి ఉంటూ, శ్మశానంలో తలదాచుకుంటూ వెన్నుచూపకుండా అప్పటి నాయకులు పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారు.

త్రిసభ్య కమిషన్ ఏర్పాటు..


రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కార్మిక సంఘాల కార్యకలాపాలపై నిర్బంధం తగ్గడంతో 1945లో హేమచంద్రాపురం దగ్గర సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు భారీ సంఖ్యలో కార్మికులు హాజరవడంతో ఒకరికి తెలియకుండా ఒకరుగా వేలాది మంది ఉద్యమంలో ఉన్నట్టుగా అర్థమైంది. ఈ క్రమంలో కార్మిక హక్కుల సాధన కోసం పోరాటం మరింత విస్తృతమైంది. దీంతో కార్మికుల డిమాండ్లు వినేందుకు తయాబ్జీ (ఉన్నతాధికారి), పింగళి వెంకట్రాం రెడ్డి (పోలీస్ అధికారి), ఫన్నాలాల్ (పారిశ్రామికవేత్త)లతో అప్పటి నిజాం/బ్రిటీష్ సర్కార్ త్రిసభ్య కమిషన్‌ను నియమించింది.

కాంట్రాక్టు వ్యవస్థ రద్దు

తయాబ్జీ కమిషన్‌కు ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం రాత పూర్వకంగా సిద్ధం చేసిన రిపోర్టును హెడ్డాఫీసు నుంచి శేషగిరిరావు తస్కరించి మరో నాయకుడు పర్సా సత్యనారాయణకు అందించారు. అప్పటిప్పుడు ఒక టీమ్ అంతా కూర్చుని తెల్లవారే సరికి ఆ రిపోర్టును కాపీ చేసి, ఒరిజినల్ పత్రాలు ఎక్కడివక్కడే ఉంచారు. తమకు లభించిన విలువైన సమాచారం ఆధారంగా నాయకులు తయాబ్జీ కమిషన్ ఎదుట కార్మికుల తరఫున బలమైన వాదనలు వినిపించడంతో పాటు ఆధారాలు కూడా సమర్పించారు. దీంతో కాంట్రాక్టు విధానం రద్దయి ఉద్యోగులనే గుర్తింపు వచ్చింది. మహిళలు, పిల్లలను గనుల్లో పని చేయించడంపై నిషేధం విధించారు. తద్వారా ఉపాధి కోల్పోయిన మహిళలకు సింగరేణి పవర్ ప్లాంట్‌లలో పని కల్పించారు. ఇలా కార్మిక హక్కుల కోసం నిరంతరం ఉద్యమించిన శేషగిరిని 1948 ఏప్రిల్‌లో నెల్లిపాక దగ్గర పోలీసులు కాల్చి చంపారు.

రహస్యంగా కార్మిక సంఘం ఏర్పాటు..

సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో 1938లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రహస్యంగా ఏర్పడింది. హెడాఫీస్‌లో క్లర్క్‌గా పని చేస్తున్న శేషగిరిరావు పోరాటంలో ముందడుగు వేశారు. ఆయన నేతృత్వంలో తూము సమ్మయ్య, చలపతిరావు, రాజారామ్‌సింగ్, పర్సా సత్యనారాయణ, పులిపాక రాజం, గాజం బాబయ్య, బోయి రామస్వామి వంటివారు కొత్తగూడెం టౌన్ కమిటీలో ముఖ్యులుగా ఉండి.. హక్కుల సాధన దిశగా కార్మికులను ఐక్యం చేశారు.



దళాలకు నీడనిచ్చిన ఇల్లెందు

42 మంది నైజాం పోలీసులను చంపిన యోధులు


ఇల్లెందు : తెలంగాణ సాయుధ పోరాటంలో ఇల్లెందు తాలూకా అగ్రభాగాన నిలిచింది. ఇక్కడ దట్టమైన అటవీ ప్రాంతంలో దళాలు ఆశ్రయం పొందేవి. తుమ్మా శేషయ్య, మారుతి ముత్తిలింగం, పాటి జగ్గయ్య, వాసయ్య, సుంకరి మల్లయ్య, దామినేని వెంకటేశ్వరరావు, కే.ఎల్. నరసింహారావు, ఏలూరి లక్ష్మీనారాయణ తదితరుల నాయకత్వంలోని దళాలలకు తొడిదెలగూడెం గ్రామానికి చెందిన బచ్చు ముత్తయ్య, తాటి నాగయ్య, ఎట్టి పుల్లయ్య, బండారి బొర్రయ్య, డిశంబర్‌లాల్ చౌదరి తదితరులు ఆహారం, నీరు అందజేసేవారు. ఆ తర్వాత నిజాం నవాబుల పాలనపై తిరగబడిన ఇల్లెందు తాలూకాలోని గార్ల మండలం వేదనాయకపురం హరిజనులు దళాలుగా ఏర్పడి దేశముఖ్ కారంముంతల రంగారెడ్డిని బయ్యారంలోని కోటగడ్డలో హతమార్చారు. ఈ ఉద్యమాలకు దాశరథి కష్ణమాచార్యులు, రంగాచార్యులు నాయకత్వం వహించారు. తొడిదెలగూడెంకు చెందిన మారుతి ముత్తిలింగం గుల్బర్గాలో జైలు జీవితం గడిపారు. దళనేతలు కంచర్ల బుచ్చిమల్లు, దామినేని వెంకటేశ్వరరావు నాయకత్వాన 1948లో బయ్యారం బండ్లకుంట సమీపంలో 42 మంది నైజాం పోలీసులను కాల్చి చంపి మృతదేహాలను బయ్యారం, గార్ల మండలాల్లో ఎడ్లబండ్లపై ఊరేగించారు. దీంతో రెచ్చిపోయిన నైజాం పాలకులు ఇల్లెందు, గార్ల, కారేపల్లి, బేతంపూడి తదితర గ్రామాల్లో 30 మందిని రెండు రోజుల్లో కాల్చి చంపి భయానక వాతావరణాన్ని సృష్టించారు.



ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం సెంటర్‌లో నిర్మించిన స్థూపం

హాయ్... కార్డుల్లో సమాచారం

- ఎస్సీ వసతిగృహ విద్యార్థులకు జారీ
- గుర్తింపుతో పాటు ఆరోగ్య, విద్య ప్రగతి వివరాల నమోదు
- ఖమ్మం జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖలో ప్రత్యేక ఏర్పాట్లు
- 5,140 మంది విద్యార్థులకు కార్డుల జారీ



విద్యార్థులకు అందించే హాయ్ కార్డు


ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల సమస్త సమాచారం ఒకే చోట పొందుపరిచేలా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు వినూత్న ఆలోచన చేశారు. ఎస్సీ హాస్టళ్లలోని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'హాయ్' పేరిట కార్డులు రూపొందించారు. ఈ కార్డులో విద్యార్థి గుర్తింపు వివరాలే కాక ఆరోగ్య సమాచారం, విద్యా ప్రగతి తదితర అంశాలను నమోదు చేస్తారు. దీంతో హాస్టల్‌కు ఏ అధికారి వచ్చినా సమాచారం తెలియడమే కాక అనారోగ్యం ఎదురైనప్పుడు చికిత్స అందించడానికి.. ప్రగతి ఆధారంగా మెరుగైన బోధన అందించడానికి సులువవుతుంది. రాష్ట్రంలో ఏ జిల్లా, ఏ శాఖలో లేని విధంగా ఖమ్మం జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు ఈ కార్డులను రూపొందించడం విశేషం.

ఒకేచోట ఆరోగ్య సమాచారం

ప్రతీ విద్యార్థికి 'హాయ్' కార్డులు జారీ చేసి ఆరోగ్య వివరాలు నమోదు చేయనున్నారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించిన సమయంలో చేసిన పరీక్షలు, వచ్చిన ఫలితాలను నమోదు చేస్తారు. వసతిగృహంలో చేరే సమయాన ఈ వివరాలు నమోదు చేయనుండడంతో ఏదైనా ఆరోగ్య సమస్య ఎదురైతే ఆస్పత్రులకు తీసుకెళ్లిన సమయాన చికిత్స అందించడం సులువవుతుందని చెబుతున్నారు.

ప్రగతి వివరాలు కూడా..

విద్యార్థులకు జారీ చేసిన హాయ్ కార్డుల్లో ప్రగతి వివరాలను కూడా పొందుపర్చనున్నారు. విద్యార్థి చదువులో ఎలా రాణిస్తున్నాడు, ప్రగతి ఎలా ఉందనే అంశాలను అధికారులు పరిశీలించి నమోదు చేసేలా ప్రత్యేక కాలమ్‌లు పొందుపరిచారు. తద్వారా తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశాల్లో ఈ కార్డుల ఆధారంగా వారికి పిల్లల ఆరోగ్య స్థితి, ప్రగతిని వివరించనున్నారు.



హాయ్ కార్డుల్లో విద్యార్థి వ్యక్తిగత సమాచార వివరాలు

మూడో తరగతి మొదలు పీజీ వరకు

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల సంక్షేమంతో పాటు వారి సమస్త సమాచారం పక్కాగా ఉండేలా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు హాయ్ కార్డులను రూపొందించారు. ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ చొరవతో రూపొందించిన ఈ కార్డులో విద్యార్థి ఫొటో, పేరు, సంరక్షకుడి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఇతర వ్యక్తిగత సమాచారం నమోదు చేస్తున్నారు. జిల్లాలోని 53 హాస్టళ్లకు ఇప్పటికే కార్డులను చేరవేశారు. మూడో తరగతి మొదలు పీజీ వరకు చదివే విద్యార్థులకు ఈ కార్డులను జారీ చేస్తారు.

సమస్త సమాచారం ఒకేచోట..



హాస్టళ్ల విద్యార్థుల కోసం 'హాయ్' పేరిట ప్రత్యేక కార్డులను రూపొందించాం. వీటిలో వ్యక్తిగత సమాచారంతో పాటు ఆరోగ్య, ప్రగతి సమాచారాన్ని పొందుపర్చాలని అధికారులను ఆదేశించాం. తద్వారా వార్డెన్లకు అవగాహన ఏర్పడడమే కాక కొత్తగా ఎవరు వచ్చినా వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు. అంతేకాక అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు చికిత్స చేయించడం సులభమవుతుంది.

– కస్తాల సత్యనారాయణ, ఎస్సీ డీడీ, ఖమ్మం జిల్లా

వ్యవసాయ ప్రదర్శనలతో రైతులకు మేలు

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- కలెక్టర్, ఎస్పీలతో కలిసి వైజ్ఞానిక మేళా ప్రారంభం
- ప్రకాశం స్టేడియానికి భారీగా తరలివచ్చిన రైతులు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం స్టేడియంలో సోమవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. మొత్తం 61 స్టాళ్లు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఆధునిక పద్ధతులతో సాగు చేసి అధిక దిగుబడులు సాధించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపకరిస్తాయని చెప్పారు. సాగులో మెళకువలు తెలుసుకునేందుకు తోడ్పడతాయని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుని ఆధునిక పద్ధతుల ద్వారా సాగు చేసి, అధిక దిగుబడి సాధించాలని పిలుపునిచ్చారు.

రైతులకు ప్రయోజనకరం : కలెక్టర్

రైతుల్లో అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్న వ్యవసాయ ప్రదర్శనలు వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రైతులకు ఎంత భూమి ఉన్నా.. అందులో అధిక దిగుబడులు సాధించి ఆర్థికాభివృద్ధి ఎలా సాధించాలనేది ఇలాంటి ప్రదర్శనల ద్వారా తెలుస్తుందని చెప్పారు. గతంలో హైదరాబాద్, ఢిల్లీ వంటి మహా నగరాల్లో మాత్రమే ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించారని, ఇప్పుడు జిల్లా రైతుల కోసం కొత్తగూడెంలోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. కాగా, ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు, ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



మిల్లెట్లతో రూపొందించిన స్వాగత పటం

రైతులకు మేలు చేసేందుకే టెక్నాలజీ ఎక్స్‌పో : మంత్రి తుమ్మల

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించేందుకే కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో అగ్రి టెక్నాలజీ ఎక్స్‌పో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఈ స్టాళ్లను చూసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు కాలానుగుణంగా మారి అధిక దిగుబడి వచ్చే పంటల సాగు పద్ధతులు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. పెద్ద నగరాలకే పరిమితమైన అగ్రి టెక్నాలజీ ఎక్స్‌పోను ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడెంలో ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యంత్ర పరికరాలు, మేలైన విత్తనాల ప్రదర్శనతో పాటు సుస్థిర, సేంద్రియ వ్యవసాయం, ఉద్యాన పంటల ప్రదర్శన, మత్స్య, పాడి పశువుల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాగా, మంగళవారం జరిగే ప్రజాపాలన వేడుకల్లో, వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.


ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన వచ్చింది



ఇప్పటి వరకు వరి, పత్తి, మొక్కజొన్న లాంటి సంప్రదాయ పంటలే వేశాం. అవి కాకుండా ప్రత్యామ్నాయంగా ఏ పంటలు సాగు చేయాలనే విషయాలను ఈ ప్రదర్శన ద్వారా తెలుసుకున్నాం. అధిక లాభాలు వచ్చే పంటల వైపు దృష్టి పెడతాం.

– పర్సా లక్ష్మి, మూకమామిడి

పంటల సాగులో మార్పు చేస్తాం



ఎప్పుడూ వేసే పంటలు కాకుండా ఆధునిక పద్ధతుల ద్వారా ప్రత్యామ్నాయ పంటలు పండించడం ఎలా అనేది వ్యవసాయ ప్రదర్శన ద్వారా తెలుసుకున్నాం. అధిక లాభాలు వచ్చే పంటలపై అవగాహన కలిగింది. అంతేకాక ఎలాంటి రాయితీలు వస్తాయనే విషయం కూడా తెలిసింది.

– బి.పద్మ, రాజాపురం

నేడు గంగమ్మ ఒడికి..

నిఘా నీడలో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

- భద్రాద్రి గోదావరికి తరలిరానున్న విగ్రహాలు
- శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా బందోబస్తు
- డీజేలకు అనుమతి లేదంటున్న పోలీసులు



గోదావరి వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలంఅర్బన్ : వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో తుది అంకానికి చేరుకున్నాయి. పది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను గంగమ్మ ఒడికి తరలించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఈ మేరకు భద్రాచలం గోదావరి వద్ద పోలీసు, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలు ప్రశాంతంగా సాగేలా సీసీ కెమెరాల నిఘాలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు స్థానిక ఏఎస్పీ అంకిత్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. భద్రాచలం గోదావరి నదిలో గతేడాది 800 గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయగా, ఈసారి జిల్లాలో 1500 పైగా వస్తాయని అంచనా వేస్తున్నారు. కాగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 551 విగ్రహాలను సోమవారం స్థానిక గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

ఉత్సవ కమిటీలతో సమావేశం..

శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా చర్యలు చేపడుతున్న పోలీసులు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. భద్రాచలంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. నిమజ్జన ప్రాంతాలతో పాటు శోభాయాత్ర నిర్వహించే మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గోదావరి వద్ద ఫైర్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను, రెస్క్యూ టీమ్‌లను సిద్ధం చేశారు. శోభాయాత్ర సందర్భంగా ఏదైనా సమస్య తలెత్తితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. భద్రాచలంలో ఆరుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 74 మంది కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. 70 మంది వైద్య సిబ్బంది, 9 బోట్లు, 3 లాంచీలు, 4 క్రేన్లు, 4 జేసీబీలు, 1 డోజర్ అందుబాటులో ఉంచారు.

డీజే సౌండ్ సిస్టమ్ పెట్టొద్దు..

శోభాయాత్రలో భారీ డీజేలకు అనుమతిలేదని పోలీసులు తెలిపారు. గణేశ్ మండపాల నిర్వాహకులు శోభాయాత్ర వాహనాలు కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని, మద్యం సేవించవద్దని సూచించారు.

భక్తులు సహకరించాలి..



వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులు అధికారుల సూచనల మేరకు నడుచుకోవాలి. ఏ నిబంధన అమలు చేస్తున్నా అది మీ భద్రత కోసమేనని గుర్తుంచుకోవాలి. నిమజ్జనంలో పాల్గొనే భక్తులు, కమిటీ సభ్యులు పోలీసులు సూచించిన రూట్ మ్యాప్ ద్వారానే రావాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే డయల్ 100కి కాల్ చేయండి.

– అంకిత్ కుమార్ సంక్వార్, ఏఎస్పీ

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



భద్రాచలంలో వినాయక నిమజ్జన ఘాట్ వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

భద్రాచలంలో గోదావరి ప్రాంతంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం సందర్శించారు. అంతకుముందు కుటుంబసమేతంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు, ఈఓ రమాదేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆ తర్వాత లాంచీలో గోదావరిలో పయనించి నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారణాసిలో వలె భద్రాచలం గోదావరి తీరంలోనూ నదీ హారతి సమర్పిస్తే ఎలా ఉంటుందని అధికారులతో చర్చించారు. దీంతో వీలైనంత త్వరలో భద్రాచలంలో నదీ హారతి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. కలెక్టర్ వెంట ఆర్డీఓ దామోదర్‌రావు, ఏఎస్పీ అంకిత్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంవీఐ మనోహర్, సీఐలు నాగరాజురెడ్డి, సంజీవరావు, సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రకాశం స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు

కొత్తగూడెంటౌన్ : ఈనెల 7 నుంచి వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు విగ్రహాలను మంగళవారం భద్రాచలంలో నిమజ్జనం చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొత్తగూడెంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి శోభాయాత్ర ద్వారా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం స్టేడియం, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్రకు ఏర్పాట్లు చేశారు.

గణపయ్య లడ్డూ వేలం పోటీలో ముస్లింలు..



ఖమ్మం రూరల్ : ఆరెంపులలో లడ్డూతో సాహెబ్ - షమీ

ఖమ్మంరూరల్/ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెంపులలో వినాయక మండపం వద్ద భక్తులు, కమిటీ బాధ్యులు లడ్డూ వేలం నిర్వహించగా దాడే సాహెబ్ - షమీ పాటపాడి రూ.23,500 పాడి దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు బి.జితేందర్, ఎస్.యాకయ్య, బి.వెంకటేశ్వర్లు, ఎం.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక ఖమ్మం 33వ డివిజన్ గాంధీనగర్‌లో వినాయకుడి చేతిలోని లడ్డూ వేలం పాటలో షేక్ లతీఫ్ తన కుమారుడు హనీఫ్ అయ్యాన్ పేరుతో డ్రాలో గెలిచాడు. ఎస్.కే.ఫిరోజ్, ఎస్.కే.యాకూబ్, జానీ, ఉత్సవ కమిటీల నిర్వాహకులు మణికంఠ, సుగుణ, మలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

▶ **సత్తుపల్లి:** సత్తుపల్లిలో ప్రసన్న గణపతి పేరిట ప్రతిష్ఠించిన గణనాథుడి చేతిలోని లడ్డూను వేలం వేశారు. ఈ లడ్డూను రూ.3.43 లక్షలకు దొండపాటి అజయ్‌కుమార్ దక్కించుకున్నారు. ఇక సత్తుపల్లిలో వాసవీ గణపతి లడ్డూను గుడిమెట్ల రామకృష్ణ రూ.37,116 వేలంలో పాడారు.

▶ **సత్తుపల్లి:** మధిర మండలం దెందుకూరులోని శ్రీ బాల గణేష్ ఉత్సవ నిర్వాహకులు 39 కేజీల లడ్డూ వేలం వేయగా రూ.2.16లక్షలకు మువ్వా వీరయ్య దక్కించుకున్నారు.

▶ **కొణిజర్ల :** మండలంలోని కొత్తూరులో గణేష్ లడ్డూను గ్రామానికి చెందిన సాయిన్ని మధు రూ.1,11,006కు వేలం ద్వారా గెలుచుకున్నాడు.

▶ **కారేపల్లి :** మండలంలోని సామ్యతండా శ్రీప్రసాన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం చేతిలోని లడ్డూను రూ.67,116కు గుగులోతు వెంకన్న దక్కించుకున్నాడు. అలాగే, బస్టాండ్ సెంటర్‌లోని విగ్రహం వద్ద లడ్డూను రూ.9,116కు గుడెల్లి శ్రీనివాసరావు, కారేపల్లి పాతశివాలయం వద్ద రూ.24,116కు పరిటాల మధు, యాదవ్‌బజార్‌లో రూ.11,116కు మణికొండ రాజేందర్, బొడ్రాయి సెంటర్‌లో రూ.8,116కు సురేందర్ మనియార్ లడ్డూ దక్కించుకున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఫారెస్ట్ ఆఫీస్ ఎదుట ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలను ఆదివారం తొలగిస్తున్న క్రమంలో ఓ దుకాణ యజమాని పంచాయతీ సిబ్బందికి అడ్డుతగిలాడు. సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో ఈఓ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దుకాణ యజమాని సాయిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్ఐ పీవీఎన్‌రావు తెలిపారు.



వైద్యం పేరుతో దందా..!

ఓ ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన

మణుగూరుటౌన్: మున్సిపాలిటీకి చెందిన ఓ వ్యక్తి తన 7 నెలల బాబుకు ఆరోగ్యం బాగాలేక ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయిస్తే మూడు రోజుల పాటు చికిత్స చేసి, తర్వాత చేతులెత్తేసి తాను చెప్పిన దగ్గరికి తీసుకెళ్లాలని సూచించాడని సోమవారం రాత్రి ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అనుమానం వచ్చి ఖమ్మం తీసుకెళ్లగా అసలు ఏ సమస్య లేదని కావాలనే తమను కమీషన్ల కోసమే నానా ఇబ్బందులకు గురి చేశారని, మూడు రోజులు లేని రోగానికి పిల్లలకు సూదులు గుచ్చి చికిత్స చేసి, పసి ప్రాణాన్ని అతలాకుతలం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత తాను చెప్పిన డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తేనే బతుకుతాడని, ఇష్టానుసారం నిర్ణయం తీసుకుంటే చెప్పలేమంటూ మానసికంగా వేధించాడని బాధితులు ఆరోపించారు. తమకు వైద్యుడి ప్రవర్తన పట్ల అనుమానం వచ్చి ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, అక్కడ అన్ని పరీక్షలు చేసి పాపకి ఏ సమస్య లేదని తేల్చారని, ప్రస్తుతం బాబు సురక్షితంగా ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితులను ఇంటికి పంపించివేశారు. ఈ విషయమై వైద్యుడిని వివరణ కోరగా, ప్రస్తుతం ఉన్న ఆరోగ్య పరిస్థితికి విరోచనాలు కూడా రావడంతో కొత్తగూడెం పోవాలని సూచించాను తప్ప అందులో తన ప్రమేయం ఏమీ లేదని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మణుగూరుటౌన్: మండలంలోని బాయికూనవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసై తరచూ భార్యను వేధిస్తున్న క్రమంలో భార్య పుట్టింటికి వెళ్లిపోగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్క కల్యాణ్(25) ట్రాక్టర్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ఇద్దరు పిల్లలు ఉండగా, మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ ఉండటంతో వారం కిందట భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా పూటుగా మద్యం సేవించి తల్లితో గొడవ పడిన కల్యాణ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మణుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో డిగ్రీ విద్యార్థిని మృతి



వరప్రదా (ఫైల్)

దుమ్ముగూడెం : మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని మోతుకూరి వరప్రదా (23) డెంగీ జ్వరంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. జ్వరంతో బాధపడుతూ ఐదు రోజులుగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. వరప్రదా మరణంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తుండగా గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బస్సుకింద పడి యువకుడు..

ఓవర్ టేక్ చేసే క్రమాన ద్విచక్ర వాహనం గుంతలో దిగడంతో ఘటన



శ్రీరామ్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు టైరు కిందపడిన ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం చెరుకుపల్లికి చెందిన తాటి శ్రీరామ్(19) ద్విచక్రవాహనంపై సోమవారం చెరుకుపల్లి నుంచి సత్తుపల్లికి వస్తున్నాడు. కిష్టారం వై-జంక్షన్ సమీపాన ఖమ్మం నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమాన ద్విచక్రవాహనం రహదారిపై ఉన్న గుంతలో పడడంతో అదుపుతప్పింది. దీంతో ఆ యువకుడు ప్రమాదవశాత్తు బస్సును ఢీకొని వెనుక టైరు కింద పడడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న శ్రీరామ్‌కు తల్లిదండ్రులు రవి – అనసూయతో పాటు ఓ సోదరుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి సీఐ కిరణ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న హోంగార్డు...



చందర్ (ఫైల్)

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాధారం మైన్ హోంగార్డు చికిత్స సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మాధారం డోలమైట్ మైన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న భూక్యా చందర్ (40)కు ఖమ్మం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో డ్యూటీ వేశారు. దీంతో మాధారం నుంచి ఆయన బైక్‌పై ఈనెల 15న ఖమ్మం వెళ్తుండగా చీమలవారిగూడెం గ్రామం వద్ద మూలమలుపులో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో చందర్ తలకు తీవ్రగాయాలు కాగా 108లో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నాగరాజకుమారి తెలిపారు.



క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

కామేపల్లి: కామేపల్లి మండలం తాళ్లగూడెం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన పుచ్చకాయల విజయ్, మునగాల మహేష్ ద్విచక్రవాహనంపై కారేపల్లి క్రాస్ నుంచి తాళ్లగూడెం స్టేజీ వైపు వెళ్తుండగా మెదురుగా కారేపల్లి మండలం మేకలతండాకు చెందిన ఓ యువకుడు బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఖమ్మం తరలించారు.

దానవాయిగూడెం వద్ద...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. రాపర్తినగర్‌లో నివాసనముండే మధిరకు చెందిన చింతల శ్రీనివాస్ సుతారీ పనులు చేస్తుంటాడు. రోజులాగే బైక్‌పై ఆయన ఖమ్మం వస్తుండగా రహదారిపై గుంత వద్ద వాహనం అదుపు తప్పి పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయనను 108లో ఆస్పత్రికి తరలించారు.

చెట్టు కొమ్మలు పడడంతో..

ఖమ్మంఅర్బన్: చెట్ల కొమ్మలను జేసీబీతో తొలగిస్తుండగా ద్విచక్ర వాహనదారుడిపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం – ఇల్లెందు ప్రధానరోడ్డులోని బల్లేపల్లి ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపాన రోడ్డు వెంట ఉన్న చెట్టు కొమ్మలను జేసీబీ ద్వారా తొలగిస్తున్నారు. జ్వరంతో బాధపడుతున్న జింకలతండాకు చెందిన గుజ్జు బాలస్వామి బైక్‌పై ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తుండగా ఆయనపై కొమ్మలు పడ్డాయి. దీంతో ఆయనకు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆయన కుమార్తె లలిత ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

తెలంగాణది త్యాగాల చరిత్ర

సీపీఐ నాయకులు జితేందర్‌రెడ్డి, పోటు ప్రసాద్



కొణిజర్ల : దొండపాటి వెంకయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొణిజర్ల/తల్లాడ/సత్తుపల్లి రూరల్: నైజాం నిరంకుశత్వ పాలన నుంచి విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటం చేయడమే కాక ప్రాణాలర్పించిన చరిత్ర తెలంగాణ పోరాటయోధులకు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొణిజర్ల మండలం తనికెళ్ల, తల్లాడ మండలం పినపాక, సత్తుపల్లి మండలం యతాలకుంటలో అమర వీరుల స్థూపాల వద్ద నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ త్యాగాలతో నిర్మించుకున్న తెలంగాణలో పాలకులు అభివృద్ధిని విస్మరించడమే కాక మౌలిక వసతుల కల్పనలోనూ విఫలమయ్యారని ఆరోపించారు. ఈ మేరకు అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలన్నారు. నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, రామాంజనేయులు, తాటి వెంకటేశ్వర్లు, సింగు నరసింహారావు, పీ.వీ.రావు, పోటు కళావతి, వి.రమేష్, భాస్కర్, ఎర్ర బాబు, శివరామకృష్ణ, ఏనుగు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, ఏపూరి లతాదేవి, దండు ఆదినారాయణ, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు దూడల జననం



గేదె వద్ద రెండు దూడలు

ఇల్లెందురూరల్: గేదెలు సాధారణంగా ఒకసారి ఒక దూడకు మాత్రమే జన్మనిస్తుంది. కానీ, మండలంలోని కొమరారం గ్రామంలో గుర్రం రామస్వామికి చెందిన గేదె ఆదివారం రాత్రి ఒకేసారి రెండు దూడలకు జన్మనిచ్చింది. రెండింటిలో ఒకటి ఆడ దూడ కాగా మరొకటి మగ దూడ. రెండు కూడా ఆరోగ్యంగా ఉన్నాయి.

ఒకే కాన్పులో... నాలుగు మేక పిల్లలు



నాలుగు పిల్లలతో మేక, రైతు

టేకులపల్లి: ఒకే కాన్పులో నాలుగు మేక పిల్లలు జన్మించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బద్దు తండా పంచాయతీ మద్దిరాలతండావాసి బానోత్ భీముడికి చెందిన మేక సోమవారం నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. పుట్టిన నాలుగు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు.

చిన్నారులను బలి తీసుకున్న కాల్వ

- సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడి ఇద్దరు చిన్నారుల మృతి
- సత్తుపల్లి మండలం బుగ్గపాడులో విషాదం
- న్యాయం చేయాలంటూ కార్యాలయం వద్ద ధర్నా



జితేంద్రకుమార్(ఫైల్)



పామర్తి శశాంక్(ఫైల్)

సత్తుపల్లి: సరదాగా ఆడుకుంటున్న చిన్నారులను సీతారామ ప్రాజెక్టు కాల్వ బలి తీసుకుంది. గణేష్ నిమజ్జనం సందర్భంగా సోమవారం పాఠశాలలకు సెలవు కావడంతో ఆడుకోవడానికి వెళ్లిన ముగ్గురు చిన్నారుల్లో ఇద్దరు సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడి కన్నుమూసిన ఘటన సత్తుపల్లి మండలం బుగ్గపాడులో సోమవారం చోటు చేసుకుంది.

మృత్యుఒడిలోకి...

గ్రామానికి చెందిన మడిపల్లి శ్రీనివాసరావు–శ్రీదేవి పెద్ద కుమారుడు జితేంద్రకుమార్(10) నాలుగో తరగతి, పామర్తి కిషోర్–సుజాత దంపతుల కుమారుడు శశాంక్(10) 3వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరు మరొకరితో కలిసి ఆడుకుంటున్నారు. కాసేపటికి ఓ చిన్నారి తిరిగి వచ్చేశాడు. అయితే, జితేంద్రకుమార్, శశాంక్ సీతారామ ప్రాజెక్టు కాల్వ వద్ద ఆడుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాల్వలో ఒకరి తర్వాత ఒకరు పడినట్లు తెలుస్తోంది. ఇటీవల వర్షాలకు కాల్వలో భారీగా నీరు ఉండడంతో మునిగిపోతూ రక్షించమని కేకలు వేశారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు వారిని బయటకు లాటి హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జితేంద్రకుమార్ తండ్రి శ్రీనివాసరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, శశాంక్ తల్లిదండ్రులు కిషోర్, సుజాత వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు ఇళ్లు ఒకే వీధిలో ఉండడంతో కలిసే ఆడుకునేవారు. వీరిద్దరు ఒకేరోజు మృతి చెందడంతో బుగ్గపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

మృతదేహాలతో ఆందోళన

ఇద్దరు చిన్నారుల మృతితో బుగ్గపాడు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. చిన్నారుల కుటుంబాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో సీతారామ ప్రాజెక్టు కాల్వ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ కార్యాలయం ఎదుట మృతదేహాలతో బైఠాయించారు. కాల్వ నిండా నీరు ఉన్నా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే అభం శుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. తక్షణం కంపెనీ యాజమాన్యం స్పందించి చిన్నారుల కుటుంబాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన ఆందోళన రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది.

మిస్టరీగా మారిన యువకుడి మృతి

మహిళ బంధువులే కారణమని అనుమానాలు


ఖమ్మంక్రైం: ఖమ్మం ఇందిరానగర్ కాలనీలో ఆదివారం భవనం పైనుంచి పడిన యువకుడు మృతి చెందగా కేసు మిస్టరీగా మారింది. హైదరాబాద్‌లో నివసిస్తున్న మలినేని కల్యాణ్‌చక్రవర్తి(30) గతంలో ఖమ్మంలో ఉన్న సమయాన్న ఇక్కడ ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించినట్లు తెలిసింది. అంతేకా క ఆయన వద్ద ఆ మహిళ కుటుంబీకులు డబ్బు అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. అయితే, వివాహేతర సంబంధం మహిళ భర్త, ఆయన కుటుంబానికి తెలిసి గొడవ చేయగా కల్యాణ్‌చక్రవర్తి హైదరాబాద్‌కు వెళ్లి నివసిస్తున్నాడు. కాగా, ఆయన ఆదివారం ఖమ్మం రాగా.. వివాహిత బంధువులు ఆయనతో గొడవ పడి పరిగెత్తించగా తప్పించుకునే క్రమంలో భవనం పైనుంచి పడ్డాడా లేక వారే భవనం పైనుంచి తోసేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, మృతుడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు కావడంతో సోమవారం మృతదేహాన్ని అక్కడకు తరలించారు. ఈక్రమంలో కల్యాణ్‌ను సదరు మహిళ కుటుంబసభ్యులే పొట్టన పెట్టుకున్నారని ఆయన తండ్రి విలపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.



బానిస బతుకులే.. బందూకులైనయ్..

మీర్ ఉస్మాన్ అలీఖాన్ సుదీర్ఘ పాలన (1911–1948) సమయంలో హైదరాబాద్ రాజ్యంలో అరాచకాలు పెరిగిపోయాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ, పోలీస్ వ్యవస్థలన్నీ నిజాం నవాబు ఫర్మానాలకు లోబడే పనిచేసేవి. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండే, పటేల్, పట్వారీలు ఊరికో నియంతలా మారిపోయారు. దీనికి తోడు ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్ (ఉర్దూలో స్వయం సేవకులు అని అర్థం) బృందాలు రెచ్చిపోయి హత్యలు, లూటీలకు తెగబడ్డాయి. ప్రతి గ్రామంలో వారానికో రోజు రజాకార్లు సమావేశమై ఆయుధాలతో మార్చ్‌ఫాస్ట్ చేసేవారు. రాజ్యంలో సంస్థానాలు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, పటేల్, పట్వారీ వ్యవస్థలు రైతుకూలీలను పీల్చి పిప్పిచేశాయి. అయితే స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి, ఆంధ్ర మహాసభలు తెచ్చిన చైతన్యంతో హైదరాబాద్ రాజ్యంలో సాయుధ రైతాంగ పోరాటం మొదలైంది. 1946 జూలై 4న అప్పటి నల్లగొండ జిల్లా కడవెండిలో విసునూరు దేశ్‌ముఖ్ ఇంటిమీదుగా వెళ్తున్న జులూస్‌పై రజాకార్లు పేల్చిన తూటాలకు దొడ్డి కొమురయ్య హతమయ్యాడు. దాంతో రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలోని సేనలు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15న కోఠిలో జాతీయ జెండాను ఆవిష్కరించే ప్రయత్నం చేసిన రామానందతీర్థను నిజాం సేనలు జైల్లో వేశాయి. నిజాం నిరంకుశ పాలనపై వార్తలు రాస్తున్న ఇమ్రోజ్ పత్రిక ఎడిటర్ షోయబుల్లాఖాన్‌ను 1948 ఆగస్టు 22న రజాకార్లు హత్య చేశారు. అన్ని జిల్లాల్లోనూ ప్రశ్నించిన వారిపై, నిజాంకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దారుణకాండకు పాల్పడ్డారు. ఈ హింసను నిరసిస్తూ హిందూ మహాసభ, స్టేట్ కాంగ్రెస్ సైతం సత్యాగ్రహ పోరాటాలు చేపట్టాయి. భారత ప్రభుత్వం హైదరాబాద్ అంశంపై దృష్టి సారించి 1948 సెప్టెంబర్ మొదటి వారంలో పోలీస్ యాక్షన్ చేపట్టింది.


సాయుధ పోరాట సాధనలో మల్లు స్వరాజ్యం తదితరులు


రజాకార్లు

ప్రపంచస్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి

- హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీలో పర్యటించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు
- రూ.2 వేల కోట్ల పెట్టుబడులతో రెండు ఫార్మా ల్యాబ్‌లను ప్రారంభించిన మంత్రి

శామీర్‌పేట్: హైదరాబాద్‌ను ప్రపంచస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీ ఫేస్ 1లో సోమవారం ఆయన పర్యటించారు. జీనోమ్‌వ్యాలీలో అధునాతన సర్టిఫైడ్ లైఫ్ సైన్సెస్ 3 జీవిని ఆయన ప్రారంభించారు. అనంతరం సైనోపోలిస్‌లో నిర్వహించిన కనెక్ట్ 2024 కార్యక్రమంలో పాల్గొని ప్రముఖ ఫార్మా దిగ్గజాలైన 60 మంది ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... జీనోమ్‌వ్యాలీలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తుందన్నందున అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల మౌలికవసతులు కల్పిస్తామని వివరించారు. ప్రపంచ ఫార్మా దృష్టిని హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీ ఆకర్షించేలా అత్యాధునిక ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు. పెట్టుబడులు రాబట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందులోభాగంగానే జీనోమ్‌వ్యాలీని సందర్శించి ఫార్మా దిగ్గజాలతో సమావేశమైనట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. అనంతరం రూ.2 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న కర్కల్యాబ్స్, లారస్ ల్యాబ్స్ పనులను ఆయన ప్రారంభించారు.

2035 నాటికి 40000 మెగావాట్ల గ్రీన్ పవర్

- రాష్ట్రంలో ఉత్పత్తికి లక్ష్యంగా పెట్టుకున్నాం: డిప్యూటీ సీఎం భట్టి
- హరిత విద్యుత్‌లో పెట్టుబడులకు తెలంగాణ సరైన వేదిక
- ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి త్వరలో కొత్త విధానం తెస్తాం
- గుజరాత్‌లో నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ సదస్సు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2035 నాటికి 40,000 మెగావాట్ల గ్రీన్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సౌర విద్యుత్ రంగంలో పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. గుజరాత్ గాంధీనగర్‌లో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ప్రారంభమైన నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సదస్సులో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో సహజ వనరులతోపాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయని, టీఎస్–ఐపాస్ వంటి సరళీకృత వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రీన్ పవర్ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రం సరైన వేదిక అని తెలిపారు. 300 రోజులకుపైగా సూర్యరశ్మి లభ్యత ఉంటుందని, 26.4 గిగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తికి అవకాశముందన్నారు. దేశంలో బలంగా గాలులు వీచే మొదటి 8 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని చెప్పారు. సుమారు 54 గిగావాట్ల పవన విద్యుదుత్పత్తికి అవకాశముందన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశముందని వెల్లడించారు. ఇతర రిజర్వాయర్లు, పాడుబడిన గనుల్లో సైతం ఈ ప్రాజెక్టులు చేపట్టవచ్చన్నారు. రాష్ట్రంలో 1500–3000 మెగావాట్ల హైడ్రోజన్, జియోథర్మల్, 250 మెగావాట్ల మినీ హైడల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశముందని చెప్పారు.

దేశ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు సహకారం

రాష్ట్రంలో గ్రీన్ పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి త్వరలో కొత్త విధానాన్ని ప్రకటిస్తామని



భట్టి విక్రమార్క వెల్లడించారు. అద్భుత ఆర్థిక వ్యవస్థతో ఐటీ, ఔషధ రంగాల్లో మేటిగా నిలిచిన తెలంగాణ.. 500 గిగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలన్న భారత దేశ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తోందన్నారు. రాష్ట్రంలో రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, మూసీ నదీ పరీవాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుల విశేషాలను వివరించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు సుస్థిర సాంకేతికతను కలిగి ఉంటాయన్నారు. పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేయడానికి చేపట్టనున్న ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ ప్రాజెక్టులు హరిత విద్యుదుత్పత్తికి విస్తృత అవకాశాలు కల్పిస్తాయన్నారు.

పెట్టుబడులకు ఆహ్వానం

సుమారు 40 మందికి పైగా ఔత్సాహిక పెట్టుబడిదారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలపై చర్చించారు. జర్మనీకి చెందిన గిజ్, టాటా పవర్, సెమ్‌కార్ప్, వెల్‌స్పన్, రెన్యూ పవర్, ఇండియా ఆయిల్, ఎన్‌హెచ్‌పీసీ, ఐబీటీ బాంటే, ఓనిక్స్, హీరో పవర్, ఊర్జా ఎనర్జీ, కేజీఎం వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపాయి. రాష్ట్రంలో పెట్టుబడులకు పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరచడంతో హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 గిగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తికి చేసిన ప్రణాళికలను భట్టి కేంద్ర మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో డిస్కంల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్ రెడ్డి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

సమీకృత గురుకులాలకు ఉమ్మడి ప్రవేశపరీక్ష!

ప్రత్యేక విధానం తీసుకురావడంపై సర్కారు దృష్టి

- ఐదో తరగతి మొదలు కళాశాలలకు సెట్
- పాత గురుకులాలకు ప్రస్తుత నిబంధనలే కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు గురుకుల సొసైటీలు వాటి పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్ట్‌లు నిర్వహించి విద్యార్థుల మెరిట్ ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించేవి. అన్ని తరగతుల్లో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టగా.. సీట్లు మిగిలిన సందర్భాల్లో స్పాట్ అడ్మిషన్ల విధానం ద్వారా పూర్తిస్థాయిలో సీట్లను భర్తీ చేసేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించనున్న సమీకృత గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చే అంశంపై అధికారులు దృష్టి సారించారు. సాధారణ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు ఇప్పుడున్న నిబంధనలు కొనసాగిస్తూనే.. సమీకృత గురుకులాలకు మాత్రం ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని భావిస్తున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచే..

గురుకుల విద్యా సంస్థల్లో ఇప్పటివరకు జరుగుతున్న ప్రవేశాలకు అర్హత పరీక్షలు ఒక్కో సొసైటీ ఒక్కో విధంగా నిర్వహించేది. కేవలం ఐదో తరగతికి మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలు ఉమ్మడిగా ప్రవేశ పరీక్ష నిర్వహించినప్పటికీ.. ఫలితాలు ప్రకటించిన తర్వాత విద్యార్థులు దరఖాస్తు సమయంలో ఎంచుకున్న సొసైటీకి రిజర్వ్ చేస్తూ ఆ మేరకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయితే ఇకపై సమీకృత గురుకుల పాఠశాలలన్నిటికీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలే నిర్వహిస్తారు. ఐదో తరగతి మొదలు, 6,7,8 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఇంటర్మీడియట్ ఫస్టియర్, డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్ల ప్రక్రియంతా ఉమ్మడిగానే నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో తొలి విడత కింద 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 సమీకృత గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈమేరకు ఆయా జిల్లా కలెక్టర్లకు భూలభ్యత, ఇతర వసతులకు సంబంధించి సూచనలు ఇవ్వగా.. కలెక్టర్లు సైతం ఇప్పటికే పూరిస్థాయి నివేదికలు పంపినట్లు సమాచారం. ఒక్కో సమీకృత గురుకులాన్ని కనిష్టంగా 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలుంటాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సమీకృత గురుకులాల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. నెల రోజుల్లోగా డిజైన్లు పూర్తి చేయాలని కమిటీ సూచించగా..అవి కూడా ఇప్పటికే తయారైనట్లు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి సమీకృత గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వార్తలు

చిరుద్యోగి పెద్దమనసు

వరద బాధితులకు అంగన్‌వాడీ టీచర్ సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాగేంద్ర, ఉపేందర్

తిరుమలాయపాలెం: ఇటీవల భారీ వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 'నా ఖమ్మం కోసం నేను' పేరిట చేపట్టిన కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుంది. తిరమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెం అంగన్‌వాడీ టీచర్ ఉండేటి నాగేంద్ర, ఉపేందర్ సోమవారం రూ.10,116 నగదును గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్‌కు అందజేశారు. చిన్న ఉద్యోగి అయినప్పటికీ వరద బాధితులకు అండగా నిలిచేలా సాయం అందజేసిన అంగన్‌వాడీ టీచర్ నాగేంద్రను గ్రామస్తులు అభినందించారు.

కుంగిన చెరువు కట్ట


కుంగిపోయిన చెరువు ప్రధాన కట్ట

అన్నపురెడ్డిపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అన్నపురెడ్డిపల్లి మండలంలోని నామవరం రెవెన్యూ పరిధిలో రాముడు చెరువు కట్ట కుంగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ చెరువు కింద 600 ఎకరాల ఆయకట్టు ఉండగా రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. భారీ వర్షాలతో చెరువు పూర్తిస్థాయిలో నిండగా, తూర్పు వైపు కట్టకు సుమారు 30 అడుగుల వరకు కుంగిపోయి బీటలు ఏర్పడ్డాయి. చెరువు కట్ట కుంగిపోవడం, బీటలు రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. కట్టకు గండి పడితే సాగులో ఉన్న పొలాలు వరద పాలవుతాయని చెబుతున్నారు. తక్షణమే నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

భద్రాద్రిలో మొదలైన నిమజ్జనం


లాంచీ ద్వారా గోదావరి నదిలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

- వివిధ జిల్లాల నుంచి వినాయక ప్రతిమలు తీసుకొస్తున్న భక్తులు
- మరో రెండు రోజులు కొనసాగనున్న నిమజ్జనం
- షిఫ్ట్‌ల వారీగా వివిధ శాఖల ఉద్యోగులకు విధులు


గణపతి ప్రతిమలతో వచ్చిన చిన్నారులు


రాముడితో కలిసి ఉన్న వినాయక విగ్రహం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో గోదావరి వద్ద గణనాథుల నిమజ్జనం సోమవారం మొదలైంది. తొలిరోజు భద్రాచలం పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమల నిమజ్జనం మొదలుకాగా.. ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు ప్రతిమలతో తరలివస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలతో పాటు సమీప జిల్లాల నుంచి భక్తులు తీసుకొచ్చే వినాయక విగ్రహాల నిమజ్జనం మరో రెండు రోజుల పాటు కొనసాగనుంది. భద్రాచలంలోని మండలపాల వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించాక గణపతి బప్పా మోరియా అంటూ నిమజ్జనానికి శోభాయాత్రగా బయలుదేరారు. శోభాయాత్ర, నిమజ్జనాన్ని చూసేందుకు భక్తులు బారులు దీరడంతో పట్టణంలోని రహదారులు, గోదావరి కరకట్ట వద్ద రద్దీ నెలకొంది. తొలిరోజు 400కు పైగా విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అంచనా. భక్తులు తీసుకొచ్చిన విగ్రహాలను గోదావరి తీరంలో దించి.. ఆ తర్వాత వరుస క్రమంలో లాంచీల్లోకి ఎక్కించి నది మధ్యలోకి గజ ఈతగాళ్లతో పంపించి నిమజ్జనం చేయిస్తున్నారు. కాగా, గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే, గోదావరిలోకి విగ్రహాలను తీసుకెళ్లేలా పడవలను సమకూర్చి గజ ఈతగాళ్లను నియమించారు. ఇక గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యాన పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి.

మొదటిసారి భద్రాచలం వచ్చాం..



మేము వరంగల్ జిల్లా సాయిరెడ్డిపల్లి నుంచి వచ్చాం. ఆదర్శ యూత్ పేరుతో వినాయకుడికి పూజలు నిర్వహించి భద్రాచలం వద్ద గోదావరిలో నిమజ్జనం చేసేందుకు వచ్చాం. మా చేతులతో నిమజ్జనం చేయాలని అనుకున్నాం. కానీ, పోలీసుల సూచనలతో సిబ్బందికి విగ్రహాన్ని అప్పగించాం.

–సురేశ్, ఆదర్శ యూత్, వరంగల్

ఏటా ఒక్కో ప్రాంతంలో..



మేం ప్రతిష్ఠించే వినాయక విగ్రహాన్ని ఏటా ఒక్కో ప్రాంతంలో నిమజ్జనం చేయడాన్ని ఆనవాయితీగా పెట్టుకున్నాం. గత ఏడాది శ్రీశైలం వెళ్లాం. ఈ సారి మా పిల్లలు, కుటుంబ సభ్యుల కోరిక మేరకు భద్రాచలం వద్ద ఉన్న గోదావరిలో నిమజ్జనం చేసేందుకు వచ్చాం. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి.

–కనకయ్య, బాలాజీనగర్, హైదరాబాద్

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు


జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమని గుర్తించి కార్మికులు, సంఘాల ఐక్యతకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పాటుపడుతోందని ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి తెలిపారు. ఖమ్మంలోని సీహెచ్.వీ.రామయ్య స్మారక భవనం వద్ద సీఐటీయూ అనుబంధ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఖమ్మం డిపో కమిటీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రశెట్టి వెంకటేశ్వర్లు పతాకాన్ని ఆవిష్కరించగా డిపో అధ్యక్షుడు పగిళ్లపల్లి నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో లింగమూర్తి మాట్లాడారు. ఆర్టీసీ సంఘాల్లో అనైక్యత నేపథ్యాన 'ఐక్యత పోరాటం'నినాదంతో 1979 సెప్టెంబర్ 16న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భవించిందని తెలిపారు. అందరూ కలిసి పోరాడితే కార్మికుల సమస్యలు సాధించుకోవచ్చని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మేనిఫెస్టోలో చెప్పిన ఏ అంశాన్నీ నెరవేర్చడం లేదని చెప్పారు. రీజియన్ ప్రచార కార్యదర్శి తోకల బాబు తదితరులు మాట్లాడగా గుగ్గిళ్ల రోశయ్య, శ్యాంసుందర్, ఎస్.రాము, బుడిగం శ్రీను, బి.నాగిరెడ్డి, ఆకుతోట శ్రీనివాసరావు, రంగా రామారావు, జె.వెంకటేశ్వర్లు, జి.ప్రభాకర్, వి.రామయ్య, బి.శంకర్, వాసు, ఎం.వెంకటేశ్వర్లు, డీ.కే.మూర్తి, గాలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో నవరాత్రి వేడుకలు


అమెరికా కరెన్సీ మాలలతో మండపం అలంకరణ

ఖమ్మంసహకారనగర్: ఉద్యోగరీత్యా విదేశాల్లో ఉంటున్న ఖమ్మం వాసులు సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోకుండా వినాయకచవితి నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఖమ్మానికి చెందిన మోత్కూరి శ్రీకాంత్, స్వాతి తమ స్నేహితులు కిశోర్, ఉప్పు వీణాలావణ్య, ప్రకాష్, సుజాత, శ్రీకాంత్, కావ్యశ్రీతో కలిసి అమెరికా టెక్సాస్‌లోని ఆబ్రే యూనియన్ పార్క్–6 ఫేజ్ కమ్యూనిటీలో వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిత్యం పూజలు చేస్తుండటమే కాక ప్రత్యేకంగా అమెరికన్ డాలర్లతో మాలలు చేసి అలంకరించారు. సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని శ్రీకాంత్, స్వాతి 'సాక్షి'కి సోమవారం ఫోన్‌లో తెలిపారు.

జీసీసీలో సేల్స్‌మెన్ల కొరత

- భద్రాద్రి జిల్లాలోని పలు గ్రామాల్లో అదే పరిస్థితి
- నిత్యావసర సరుకుల పంపిణీలో జాప్యం
- 133 మంది సేల్స్‌మెన్లకు 25 పోస్టులు ఖాళీ


సేల్స్‌మెన్ లేక తెరుచుకోని మల్లారం డిపో

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సేల్స్ డిపోల్లో సేల్స్‌మెన్ల కొరత వేధిస్తుంది. ఏళ్లుగా సేల్స్‌మెన్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతుండగా గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. భద్రాచలం డివిజన్ జీసీసీ పరిధిలో పాల్వంచ, మణుగూరు, దమ్మపేట, ఇల్లెందు, భద్రాచలం బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 149 సేల్స్ డిపోలు, ఏడు పెట్రోల్ బంక్‌లు కొనసాగుతున్నాయి. రెగ్యులర్ సేల్స్ మెన్లు 37 మంది, ఔట్‌సోర్సింగ్ విధానంలో 41 మంది, స్వయం సహాయక గ్రూపుల సేల్స్‌మెన్లు 25 మంది, కాంట్రాక్టు సేల్స్‌మెన్లు 30 మంది పనిచేస్తున్నారు. భద్రాచలం బ్రాంచ్ పరిధిలో మూడు, పాల్వంచ పరిధిలో మూడు, ఇల్లెందు బ్రాంచ్ పరిధిలో నాలుగు, దమ్మపేట బ్రాంచ్ పరిధి 43 డిపోలకు గాను 15 సేల్స్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పక్క డిపో ఉద్యోగులకు అదనపు బాధ్యతలు

జీసీసీ సేల్స్ డిపోల్లో సేల్స్‌మెన్లు లేని చోట సమీపంలోని సేల్స్‌మెన్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో వీరిపై పనిభారం పడి ఎక్కడ విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఎదురవుతోంది. ఫలితంగా సరుకులు సక్రమంగా అందడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, పాల్వంచ జీసీసీ బ్రాంచ్ ద్వారా పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు మండలాల పరిధిలో 30 సేల్స్‌డిపోలు ఉన్నాయి. ఇందులో పాల్వంచ మండలంలో 11 డిపోలకు మల్లారం, కిన్నెరసానిలో సేల్స్‌మెన్లు లేక సరుకుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉల్వనూరు సేల్స్‌మెన్ పాల్వంచ నుంచి వచ్చివెళ్తా కొద్దిరోజులు ఇక్కడ, ఇంకొన్ని రోజులు మల్లారం డిపోలో సరుకులు పంపిణీ చేస్తుండగా స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అలాగే, కిన్నెరసాని సేల్స్‌మెన్ హరిరామ్ నెల రోజుల కిందట ఇల్లెందుకు బదిలీకాగా అయిన స్థానంలో చర్ల నుంచి రావాల్సిన వీరస్వామి విధుల్లో చేరలేదు. దీంతో కిన్నెరసాని బాధ్యతలను చంద్రాలగూడెం సేల్స్‌మెన్‌కు అప్పగించారు. మరోపక్క 31 మంది ఔట్‌సోర్సింగ్ సేల్స్‌మెన్లకు రూ.13 వేలకు పైగా వేతనం చెల్లిస్తుండగా గత మే నెల నుంచి జీతాలు రావడం లేదు. ఇక సరుకుల విక్రయాలు తగ్గుముఖం పట్టడంతో సేల్స్‌మెన్లకు కమీషన్ కూడా ఇచ్చే పరిస్థితి లేదు.

ప్రతిపాదనలు పంపించాం..

సేల్స్‌మెన్ల కొరత, తదితర సమస్యలపై జీసీసీ డీఎం స్పందిస్తూ ఔట్‌సోర్సింగ్ సేల్స్‌మెన్లకు నాలుగు నెలల వేతనాలు రావాల్సి ఉందని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. ఇక పాల్వంచ జీసీసీ మేనేజర్ లక్ష్మోజీ వివరణ కోరగా మల్లారం డిపో సేల్స్‌మెన్ లేకపోవడంతో ఉల్వనూరు సేల్స్‌మెన్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చామని వెల్లడించారు. కిన్నెరసాని సేల్స్‌మెన్‌కు నెల కిందట బదిలీ కాగా మరో సేల్స్‌మెన్ రావాల్సి ఉందన్నారు. తిమ్మంపేట ఉద్యోగికి గుండాలపాడు, ఇరువేండి ఉద్యోగికి బుర్గంపాడు డిపోలకు బాధ్యతలు అదనంగా కేటాయించామని, బదిలీ అయిన వారు విధుల్లో చేరితే ఖాళీగా ఉన్న డిపోలకు కేటాయిస్తామని తెలిపారు.